క్లుప్తంగా

నేడు 'బుద్ధునితో నా ప్రయాణం' నృత్య రూపకం

హన్మకొండ కల్చరల్: గౌతమ బుద్ధుడి జీవిత విశేషాలను తెలిపే బుద్ధునితో నా ప్రయాణం నృత్య రూపకాన్ని హనుమకొండలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు ప్రదర్శించనున్నారు. అభ్యుదయ ఆర్ట్ అకాడమీ, ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ భారతీయ బౌద్ధ మహాసభ నిర్వాహకుల ఆధ్వర్యంలో నృత్యరూపకం ప్రదర్శించనున్నారు. నగరవాసులు అధిక సంఖ్యలో హాజరై ప్రదర్శనను తిలకించాలని కోరారు.

ఆర్టీసీలో ఏడీసీ పదోన్నతి కల్పించాలి

హన్మకొండ: అర్హులైన ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు వెంటనే ఏడీసీ పదోన్నతి కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ కోరారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతి కల్పించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేసినా పదోన్నతి కల్పించకుండా వరంగల్ రీజినల్ మేనేజర్ జాప్యం చేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మే 2 నుంచి 10వ తేదీ వరకు ఏడీసీ పదోన్నతి కోసం సమ్మతి పత్రాలు స్వీకరణకు అవకాశమిచ్చినా చాలామంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ముందుకు రాకపోవడంతో గడువు మే 20 వరకు పెంచారని తెలిపారు. సమ్మతి పత్రాలు అందించి రోజులు గడుస్తున్నా పదోన్నతి ప్రక్రియ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక సేవ పతకానికి ఎంపికైన వరంగల్ ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్‌ను స్థానిక కార్పొరేటర్ గందె కల్పన – నవీన్ దంపతులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపెల్లి రాజేష్, బీజేపీ వరంగల్ జిల్లా రజక సెల్ కన్వీనర్, 28వ డివిజన్ అధ్యక్షుడు రామిని కృష్ణ, సుమన్, గన్ను రఘు, వజినపెల్లి సాయి, కలువ రమనీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో సదస్సు ప్రారంభం



హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సు శనివారం ప్రారంభమైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్, హ్యూమానిటీస్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో మ్యాట్ ల్యాబ్ – పెడగాజీ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మ్యాట్ ల్యాబ్ నిపుణురాలు డాక్టర్ అర్చన పవార్ మాట్లాడుతూ ప్రస్తుత ఇంజనీరింగ్ ప్రాముఖ్యత, అనువర్తనాలను వివరించారు. మ్యాట్ ల్యాబ్ అనేది సాంకేతిక వేదికగా పేర్కొన్నారు. ప్రధానంగా సంఖ్యా కంప్యూటరింగ్ డేటా విశ్లేషణ, విజువలైజేషన్, అల్గోరిథం అభివృద్ధి కోసం ఉపయోగపడుతోందని చెప్పారు. లైవ్ ప్రాజెక్టు రూపకల్పన, వాడకంలో మ్యాట్ ల్యాబ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ వేణుమాధవ్, డాక్టర్ కె.శివశంకర్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సే



హసన్‌పర్తి: తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కందుకూరి చంద్రమోహన్, కార్పొరేటర్ రవినాయక్, నాయకులు బొమ్మగాని వెంకటేష్‌గౌడ్, భట్టు రాకేష్, పెద్ది కర్ణాకర్‌రెడ్డి, సంపత్ యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఏలు విడుదల చేయాలి

దామెర: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని సూచించారు.

రాత్రి డంపింగ్.. పగలు లిఫ్టింగ్

- యథేచ్ఛగా మొరం దందా
- చక్రం తిప్పుతున్న పంచాయతీ ఉద్యోగి



డంప్ చేసిన మొరం



మొరం తరలించడానికి వచ్చిన లారీలు

హసన్‌పర్తి: అక్రమ మొరం వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చెరువులు, కుంటలు, గుట్టలు ఎక్కడ కనిపిస్తే అక్కడ అక్రమ మొరం వ్యాపారులు వాలుతున్నారు. అధికారులు మాముళ్లకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది. చెరువులు, గుట్టల నుంచి నేరుగా నిర్మాణాల వద్దకు మొరం తరలించకుండా కొత్త మార్గానికి వ్యాపారులు తెరలేపారు. రాత్రివేళ ఓ ప్రాంతంలో మొరాన్ని డంప్ చేసి, పగలు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు హసన్‌పర్తి మండలం అర్వపల్లి, సిద్దాపురంలో నిత్యం జరుగుతున్నాయి.

అర్వపల్లి శివారులో మొరం దందా

హసన్‌పర్తి మండలం అర్వపల్లి శివారులోని ఓ చెరువు నుంచి రాత్రి వేళల్లో అక్రమార్కులు పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఆ మొరాన్ని అర్వపల్లి శివారులోని ఓ ప్రదేశంలో డంప్ చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. పగలు మాత్రం దర్జాగా టిప్పర్ల ద్వారా పట్టణాలకు తరలిస్తున్నారని చెబుతున్నారు. టిప్పర్ మొరం మార్కెట్‌లో రూ.10 వేల నుంచి రూ.12 వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజూ 30 నుంచి 40 టిప్పర్ల వరకు మొరాన్ని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చక్రం తిప్పుతున్న పంచాయతీ ఉద్యోగి

ఈ వ్యవహారంలో ఓ పంచాయతీ ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు పంచాయతీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు మొరం అక్రమ దందా చేస్తున్నట్లు స్థానికులు చెప్పారు. గతంలో కూడా ఆ పంచాయతీ ఉద్యోగిని అధికారులు మందలించిన సందర్భాలు ఉన్నాయని, ఈ వ్యవహారంలో రెవెన్యూ, పోలీస్‌తో పాటు నీటి పారుదల శాఖ ఉద్యోగులకు కూడా సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

బీసీ రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం..



నయీంనగర్: మాట్లాడుతున్న వేణుగోపాల్ గౌడ్



హసన్‌పర్తి: నినదిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖిలా వరంగల్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నయీంనగర్: 42శాతం బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ చేసిన తీర్మాణాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబినెట్ తీర్మాణం ముమ్మాటికి బీసీల పోరాట విజయమే అని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు అగ్రకులాల నాయకులు అడ్డుపడితే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయించాలని ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దాడి మల్లయ్య యాదవ్, చిర్ర రాజుగౌడ్, మాదం పద్మజాదేవి, తమ్మెల శోభారాణి, సుగుణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై హర్షం

హసన్‌పర్తి: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. నగరంలోని 3వ డివిజన్ ఆరెపల్లిలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ షీబారాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బుద్దె పెద్దన్న, కాంగ్రెస్ వరంగల్ మండల అధ్యక్షుడు జన్ను సుధాకర్, నాయకులు రాము, సంపత్, అఖిల్, వివేక్, గోపాల్, కుమారస్వామి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖిలా వరంగల్: 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు సందర్భంగా వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫ్లెక్సీలకు శనివారం పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చింత ప్రకాష్, కొమురెల్లి రవీందర్, స్పందన్, మన్నె బాబురావు, రాజ్‌కుమార్, ఇనుగాల జోగిరెడ్డి, శివకుమార్, దశరథం, వెంకటేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



హసన్‌పర్తి: కరపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు



మడికొండ: సఖి సేవలను వివరిస్తున్న ప్రతినిధులు

హసన్‌పర్తి: ప్రతీ మహిళ.. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి కేస్ వర్కర్ భారతి సూచించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, సర్వోదయ సంస్థ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుండ్ల సింగారంలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే ప్రదేశంలో వేధింపులు, అత్యాచారాలకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటోందని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు బాధితులు 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు డయల్ చేయాలని కోరారు. అనంతరం సఖి సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు లావణ్య, రాధ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన

మడికొండ: సఖి, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో సఖి సేవలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ ప్రతినిధులు అనూష, భారతి పాల్గొని సఖి అందించే ఐదు రకాల సేవలను వివరించారు. ఉచిత కౌన్సెలింగ్, వైద్యం, పోలీసు, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలకలు 0870 – 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అనంతరం సఖి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

గణపతి దీక్షల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మండలి సభ్యులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గణపతి దీక్షల తేదీల కరపత్రాలను భక్తులతో కలిసి ఆలయ పాలక మండలి సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల దీక్షల తేదీలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ప్రకటించారు. గణపతి నవరాత్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని మాలలు ధరించే భక్తులు పాటించాల్సిన నియామలు, పూజా విధానం పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, హరికృష్ణ శర్మ, ఎల్.రవి తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీకి ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సైంటిస్టు రఘుపతి

కేయూ క్యాంపస్: ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని అమెరికాలోని సీనియర్ సైంటిస్టు డాక్టర్ నీలారపు రఘుపతి అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కెమిస్ట్రీలో విషయ పరిజ్ఞానం, ప్రయోగాల నైపుణ్యం, టెక్నాలజీలో పట్టు సాధిస్తే కెమిస్ట్రీ శాస్త్రవేత్తలు అయ్యే అవకాశం ఉందని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి చేయూత



సాంబమూర్తికి ఆర్థిక సాయం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కాజీపేట రూరల్: దర్గా కాజీపేటలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఇంటి వద్దనే ఆక్సిజన్‌పై చికిత్స పొందుతున్న తీగల సాంబమూర్తికి వుయ్ కెన్ డూ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ శనివారం చేయూతనిచ్చింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గెడ్డేటి నరేష్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో తీగల సాంబమూర్తి అనారోగ్యానికి గురై ఆక్సిజన్ మీదనే జీవితాన్ని వెల్లదీస్తున్నాడని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని రూ.8 వేలు అందించినట్లు వివరించారు. అలాగే, సంస్థ సభ్యుడు శిరంశెట్టి శ్రీనివాస్ – సుజాత దంపతులు తమ కుమారుడి జన్మదినం సందర్భంగా రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అద్దంకి ప్రసాద్, పంజాల అశోక్, జంగిలి శ్రీనివాస్‌రావు, అమంచ చంద్రశేఖర్, బొజ్జం సతీష్, శిరంశెట్టి అలోక్ మహంతి, శిరంశెట్టి అశ్వర్థ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి నిధులు

కమలాపూర్: వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.79.50 లక్షలు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నుంచి విడిపోయి స్వతంత్ర మార్కెట్‌గా ఏర్పడింది. చైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ కోసం రూ.63 లక్షలు, ప్రహరీ నిర్మాణం కోసం రూ.16.50 లక్షలు మంజూరైనట్లు చైర్‌పర్సన్ వివరించారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) భీమారం శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ – కరీంనగర్ జాతీయ రహదారిలోని భీమారం సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భానుప్రసాద్ మాట్లాడుతూ రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. పరీక్షలు రాయడానికి అనుమతి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఆగడాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భీమారంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు బొంకూరి భాను, కార్యదర్శి పి.సుధీర్, ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, అక్షయ్, రాజు, కొట్టె వంశీ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌లో ఉచిత వైద్యశిబిరం



ప్రెస్ క్లబ్‌లో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత మెగా వైద్యశిబిరంలో భాగంగా మొదటిరోజు శనివారం జర్నలిస్టులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా నిపుణులైన వైద్యులు ఆదివారం పరీక్షించి అవసరమైన వైద్యం అందించనున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టుల వైద్యశిబిరం ఏర్పాట్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, జర్నలిస్టులతో మాట్లాడారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు తోట సుధాకర్, కంకణాల సంతోష్, గాడిపెల్లి మధు, వల్లాల వెంకటరమణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటితే ఉద్యోగం



కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కమల్ యాదవ్, తదితరులు

మామునూరు: ఫార్మసీ విద్యార్థులు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్ అన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ప్రముఖ ఫార్మా సంస్థ, డివీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ శనివారం జరిగింది. డ్రైవ్‌లో రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 200కు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కమల్ యాదవ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఎక్కువగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రావుల శివకుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, నాగరాజుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవి



హన్మకొండ: కార్మికులకు పీపీఈ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి



పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వసంత



కాజీపేట అర్బన్: మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు

హన్మకొండ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవని, ఈ క్రమంలో వారు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సూచించారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని స్వగృహంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్, సబ్బులు, గ్లౌజులు, ఆప్రాన్, టవల్ ఈ కిట్‌లో ఉంటాయన్నారు. వాటిని వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌డబ్ల్యూఎస్ నల్ల సుధాకర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.బాషా నాయక్, జవాన్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హన్మకొండ: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ భవానినగర్ రోడ్డు నంబర్ –4బీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మహేందర్ రెడ్డి, జవాన్లు సతీష్, భిక్షపతి, విక్కి మహేష్, భవాని నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రకాష్ రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కాజీపేట అర్బన్: మున్సిపల్ కార్మికులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు శానిటేషన్ కిట్లను కార్పొరేటర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విధులు నిర్వహిస్తున్న తరుణంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సిబ్బంది చంద్రమౌళి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై వినూత్న ప్రచారం



కాజీపేట పోలీస్ స్టేషన్ ప్రహరీపై ఏర్పాటు వాల్‌పోస్టర్లు

- వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు





కాజీపేట: ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కాజీపేట పోలీసులు వినూత్న పద్ధతుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాలు జరగడానికి కారణాలు, నివారణ చర్యలపై విస్తృత ప్రచారాన్ని చేపట్టాలనే ఆలోచనలతో నూతన ప్రచార విధానానికి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రధాన రహదారిపై ఉన్న పోలీస్ స్టేషన్ ప్రహరీపై చక్కటి పెయింటింగ్ బొమ్మలు వేయించారు. ఇటీవల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదహరిస్తూ బొమ్మలు ఏర్పాటు చేశారు. కాజీపేట పోలీస్ స్టేషన్ ప్రహరీపై వేసిన బొమ్మల్లో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదం ఎలా జరుగుతుందో స్పష్టంగా పేర్కొన్నారు. అదే ఫ్లెక్సీపై యమధర్మరాజు తన వాహనంపై రా..రా.. నీ కోసమే వచ్చాను అనే చిత్రాన్ని వ్యంగ్యంగా ఆకట్టుకునేలా చిత్రీకరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, సరైన కాగితాలు లేకుండా రోడ్డుపైకి రావడం, మితిమీరిన వేగం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడడం, సామర్థ్యానికి మించి వాహనాలపై ప్రయాణించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించకపోవడం వంటి పలు అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు వారు చేస్తున్న ప్రయత్నాలకు వాహనదారులు నిబంధనలు పాటించినప్పుడే సత్ఫలితాలు వస్తాయని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి దుర్మరణం



హసన్‌పర్తి: కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు దుర్మరణం చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం మడిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బుర్ర కుమారస్వామి(49) శుక్రవారం సాయంత్ర కల్లుగీయడానికి వనానికి వెళ్లాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.